# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ నదుల పరిశుభ్రత, పునరుజ్జీవనం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు.
- ❖ భారత రక్షణ రంగం ఎగుమతుల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈరోజు జేఈఈ మెయిన్ సెషన్ -2 ఫైనల్ 'కీ' విడుదల చేసింది.
- ❖ దేశంలో 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు.
- ❖ వక్ఫ్ చట్టంపై వివరణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును వారం రోజుల గడువు కోరింది.

=====================

నదుల పరిశుభ్రత, పునరుజ్జీవనం కోసం ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. యమునా నది పరిరక్షణకు సంభందించిన భవిష్యత్ ప్రణాళికలపై చర్చించేందుకు ప్రధానమంత్రి అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నదిని శుభ్రపరచడానికి ఏజెన్సీల వారీగా కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. మురుగునీటి శుద్ధి కర్మాగారాల పని తీరును పర్యవేక్షించడానికి, అలాగే కాలువల్లో ప్రవాహాలను కొలవడానికి రియల్-టైమ్ డేటాను సేకరించడానికి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధానమంత్రి సూచించారు. ఢిల్లీ సమగ్ర నీటి నిర్వహణ కోసం అర్బన్ రివర్ మేనేజ్‌మెంట్ ప్రణాళికాను రూపొందించాలని, దానిని సిటీ మాస్టర్ ప్లాన్‌తో అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జల్ శక్తి మంత్రి సిఆర్ పాటిల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, ఇతర ప్రభుత్వ ఉన్నత అధికారులు హాజరయ్యారు.

=====================

భారత రక్షణ రంగం స్వావలంబన దిశగా ముందుకు సాగుతోందని, ఎగుమతుల సామర్థ్యాన్ని కూడా బలోపేతం చేస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన డిఫెన్స్ కాన్‌క్లేవ్- "ఫోర్స్ ఆఫ్ ది ఫ్యూచర్" ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సాయుధ దళాల ఆధునీకరణతో పాటు రక్షణ రంగంలో స్వావలంబనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రక్షణ రంగంలో స్వావలంబనను మరింత ప్రోత్సహించడానికి రక్షణ మంత్రిత్వ శాఖ 2025 సంవత్సరాన్ని సంస్కరణల సంవత్సరంగా ప్రకటించిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

జేఈఈ మెయిన్ సెషన్ -2 ఫైనల్ 'కీ'ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈరోజు విడుదల చేసింది. ఫైనల్ 'కీ'ని jeemain.nta.nic.in వెబ్ సైట్ లో అందుబాటులో ఉందని ఎన్‌టీఏ ప్రకటించింది. రెండో విడత పరీక్షలను ఈనెల 2వ తేదీ నుంచి 9వ వరకు ఎన్‌టీఏ నిర్వహించింది. గత జనవరిలోనూ, ఇటీవల జరిగిన రెండవ విడత పరీక్షల్లోని ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయిస్తారు. అయితే, జేఈఈ-మెయిన్ పరీక్ష సమాధానాల్లో పలు తప్పిదాలు ఉన్నాయని ఫిర్యాదులు వస్తుండడంపై స్పందించిన ఎన్‌టీఏ.. తుది 'కీ' వచ్చేవరకు విద్యార్థులు వేచి చూడాలని సూచించింది. తుది 'కీ' మాత్రమే స్కోరును నిర్ణయిస్తుందని, ప్రాథమిక 'కీ'ల ఆధారంగా విద్యార్థులు ఓ నిర్ణయానికి రాకూడదని స్పష్టం చేసింది.

=====================

వక్ఫ్ (సవరణ) చట్టం రాజ్యాంగ నిబద్ధతను సవాలు చేస్తూ.. దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు ఈరోజు విచారణ కొనసాగించింది. వక్ఫ్‌పై చట్టంపై వివరణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం వారం రోజుల గడువు కోరగా.. న్యాయస్థానం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటీఫై చేయబోమని ప్రభుత్వం తెలిపింది. అయితే, అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను సుప్రీం కోర్టు మే 5వ తేదీకి వాయిదా వేసింది.

=====================

దేశంలో జాతీయ రహదారులపై టోల్ ఫీజు వసూళ్ల విధానంలో కీలక మార్పు రానున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఫాస్టాగ్ వ్యవస్థ స్థానంలో, GPS ఆధారిత టోల్ వసూళ్ల విధానం (GNSS) ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మే 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా GNSS వ్యవస్థను అమలు చేయాలని యోచిస్తోంది. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (GNSS) ద్వారా వాహనాల స్థానాన్ని ట్రాక్ చేసి, ప్రయాణించిన దూరం ఆధారంగా టోల్ ఫీజు ఆటోమేటిక్‌గా వసూళ్లు చేయబడుతుంది. ప్రస్తుతం GNSS వ్యవస్థను పలు జాతీయ రహదారులపై ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఈ నిర్ణయంతో టోల్ ప్లాజాల వద్ద వాహనాలు రద్దీ సమస్య తగ్గి, వాహనదారుల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది.

విరామం

=====================

భారతదేశపు స్మార్ట్ ఫోన్ ఎగుమతులు రికార్డు స్థాయిలో 2 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మొదటి 10 నెలల్లో స్మార్ట్‌ఫోన్‌ల ఎగుమతిలో భారతదేశం అతిపెద్ద ఎగుమతిదారుగా నిలిచిందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. 2013-14లో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులలో దేశం 167వ స్థానంలో ఉండగా, ఇప్పుడు అది ప్రథమ స్థానానికి చేరుకుందన్నారు. 2020లో ప్రభుత్వం స్మార్ట్ ఫోన్‌ల ఉత్పత్తి కోసం సంబంధిత ప్రోత్సాహక పథకాన్ని

ప్రారంభించిందని, ఈ రంగ అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడిందన్నారు. ముఖ్యంగా లక్షలాది మంది మహిళలకు ఈ రంగంలో ఉద్యోగాలు లభించాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

=====================

భారతదేశాన్ని నక్సల్స్ రహిత దేశంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. CRPF 86వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈరోజు మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్రమంత్రి పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనలో CRPF జవాన్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే దేశ సంకల్పం వారి అజేయమైన ధైర్యం బలంతో నెరవేరుతుందని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన  అమరవీరుల ధైర్యసాహసాలు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయన్నారు. ప్రభుత్వం CRPF జవాన్ల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతుందని అమిత్ షా పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

=====================

భారతదేశం 6.5 శాతం వృద్ధి రేటుతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ, ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని ఐక్యరాజ్యసమితి ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (UNCTAD) పేర్కొంది. 'ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ ఫోర్‌సైట్స్ 2025' నివేదికలో అధిక ప్రభుత్వ వ్యయం, ద్రవ్య విధాన ఉద్దీపనతో వృద్ధిని ముందుకు తీసుకెళ్లే దేశాల జాబితాలో భారతదేశం చేరింది. ఈ నివేదిక చైనా వృద్ధి రేటును 4.4 శాతంగా అంచనా వేసింది. అమెరికా ఆర్థిక వ్యవస్థను ఒక శాతంగా అంచనా వేసింది. యూరోపియన్ యూనియన్ వృద్ధి కూడా 1 శాతంగా, ఫ్రాన్స్ జర్మనీ, ఇటలీ 1 శాతం కంటే తక్కువ వృద్ధిని నమోదు చేస్తాయని తెలిపింది. అదేవిధంగా, జపాన్ ఆర్థిక వృద్ధి రేటు కేవలం 0.5 శాతానికి తగ్గుతుందని నివేదిక పేర్కొంది.

=====================

అమెరికా ఉపాధ్యక్షులు జేడీ వాన్స్ ఈ నెల 21వ తేదీన భారత్ పర్యటనకు కుటుంబ సమేతంగా రానున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈరోజు ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూడు రోజుల పర్యటనలో భాగం జేడీ వాన్స్ కుటుంబంతో దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

=====================

రానున్న 3, 4 రోజుల్లో పలు రాష్ట్రాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐ.ఎం.డి) తెలిపింది. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కారైకల్, కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ, తెలంగాణ, కర్ణాటకతో సహా అనేక ప్రాంతాల్లో రాబోయే 3 రోజులు ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఐ ఎం డి వెల్లడించింది.

=====================
=====================